# పూలవాన

ఆంధ్రభూమి మంత్లీ.. ఏప్రిల్, 2002



“ఊపిరాడని సుడిగుండంలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరవుతున్న నాపై పూలవాన కురిపించి మనసును సేదదీర్చారు. మెత్తని హృదయాన్ని పన్నీటితో స్నానం చేయించిన మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. మీ సాంగత్యంలో ఈ జీవితం రాగమయంగా సాగిపోవాలని నా ఆశ!”

ఆ అమ్మాయి అన్నమాటలు జ్ఞాపకం వచ్చి- రాఘవేంద్ర మనస్సు భారంగా నిట్టూర్చింది. ఈ విషయమై గత వారంరోజుల నుండి ఏ విధమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నాడు.

‘ఆమెను దగ్గరకు చేరదీయాలా, వద్దా..? ఆమెను పెళ్ళిచేసుకోవడం..?’

– తలచుకుంటే చాలా వింతగా ఉంది.

అసలు తనప్రక్క ఊహించుకోవడానికే మనసొప్పడం లేదు.

పేరు అవని. ఎంత చక్కని పేరు..! భూమాత అంత ఓర్పు, సహనం ఆమెలో చూశాడు.

చదువుసంధ్యలు పెద్దగా లేకపోయినా– చూస్తున్నంతసేపూ ఆమె ఓ జీవన సరస్వతిలా అనిపించింది.

ఆ సంస్కారం, నడవడిక, రూపలావణ్యం, కలుపుగోలుతనం, సమస్యను సున్నితంగా విశ్లేషించడం... అన్నీ రాఘవేంద్రకు విపరీతంగా నచ్చాయి.

ఆమెను తను వివాహం చేసుకుంటే..ఝ! ఏమో... ఆమె అవసరం ఆమెది– తన అవసరం తనది! అన్నింటినీ మించి– ఆమె మనసు చాలా మంచిది. అవని మనసు చెప్పిన మూగఊసులు తనని కదిలించి వేశాయి.

రాఘవేంద్ర పెళ్ళిచూపులు చూసి వచ్చినప్పటి నుండి ఆమె గురించే ఆలోచిస్తున్నాడు. ప్రతిక్షణం ఆమె పదేపదే గుర్తుకు రాసాగింది. ఆమెకు తనని పెళ్ళిచేసుకోవడం అభ్యంతరం లేకపోవచ్చు. జీవితంలో రాజీపడ్డ ఆమె కోర్కెలకి, సంతోషాలకి అతీతంగా కనబడుతోంది.

ఈ లోకంలో ఎందరో ఆడవాళ్ళు తమతమ సమస్యలకి తలొగ్గి పరిస్థితులతో రాజీపడి బ్రతుకుతున్నారు... చివరికి తమ జీవితాలని నిర్వీర్యం చేసుకుంటున్నారు. కట్నాలు ఇచ్చుకోలేని తల్లిదండ్రులకు భారమై పెళ్ళిళ్లు అవక, సమాజంలో చిన్నచూపు చూడబడుతున్నారు. పోనీ, ఏదో ఉద్యోగం చేస్తూ తమ కాళ్లపై తాము నిలబడి, కన్నవారికి కొంతవరకు సహాయపడదామంటే– చదువుకోవాలంటే ఆర్థిక సమస్య, ఉద్యోగం చేయాలంటే నిరుద్యోగ సమస్య! లేమితనం వెక్కిరిస్తుంటే– అవమానాల్ని అధిగమిస్తూ బ్రతకడం వారికి దుర్భరమవుతోంది.

ఆలోచిస్తున్న రాఘవేంద్ర మనసులో సానుభూతి ప్రకటించాడేగానీ, ఏమీ నిర్ణయించుకోలేక పోతున్నాడు.

"అయ్యగారూ... ఫోన్!" పనిమనిషి రమణయ్య కార్డ్‌లెస్ ఫోన్ తీసుకొచ్చి ఇచ్చాడు.

"హలో..!"

"నేను పురుషోత్తాన్ని!" అవతలి నుండి విన్పించింది.

"................"

"మొన్న చూసిన పోరుమామిళ్ళ సంబంధం గురించి ఏమి నిర్ణయించుకున్నారు?"

"................"

"భద్రమూర్తిగారు పెద్దమనిషి! వారిది చాలా మంచి కుటుంబం. అమ్మాయి ఉన్నతురాలు, గుణవంతురాలు. కట్నం ఇచ్చుకోలేని పేదరికం ఒక్కటే వారికి అడ్డంకిగానీ– లేకపోతే, రెండో పెళ్ళిసంబంధం చూడవలసిన అవసరమే లేదు. నా మాట వినండి... ఇది చాలా మంచి అవకాశం! అమ్మాయి మిమ్మల్ని, మీ తల్లిగారిని చక్కగా చూసుకోగలదు!"

"అదే ఆలోచిస్తున్నాను... ఎటూ తేల్చుకోలేకపోతున్నాను!"

"తేల్చుకోవడానికి ఏముంది? మీరు చాలా ధనవంతులు... మంచి ఉద్యోగస్తులు... సంఘంలో పరపతి గలవారు. అటువంటి మీకు ఓ పేదింటి అమ్మాయి భార్యగా వస్తే పనిపాటల్లోను, ప్రేమాభిమానాల్లోనూ చేతికి అందివచ్చినట్లుగా ఉంటుందని నా అభిప్రాయం. మీరు 'ఊఁ...'

అంటే వచ్చే శ్రావణమాసంలో ముహూర్తాలు పెట్టుకోవచ్చు. భద్రమూర్తిగారు కూడా మిమ్మల్ని అల్లుడిగా చేసుకోవాలని ఆరాటపడుతున్నారు!"

రాఘవేంద్ర ఆలోచనల్లో పడ్డాడు.

"రమణయ్యా! అఖిల్ ఆఫీసుకు వెళ్లిపోయాడా?"

"అవునయ్యా! ఈరోజు సాయంత్రానికి తను బ్యాంక్ పనిమీద చెన్నై వెళ్లాలట... మీతో చెప్పమన్నారు. మీరు ఆలస్యంగా నిద్రలేవడంతో... నన్ను చెప్పమని వెళ్లిపోయారు!"

రాఘవేంద్ర డైనింగ్‌హాలులోని తూగుటుయ్యాలలో కూర్చునివున్నాడు. దానిలాగే అతని మనసులోని ఊహలు ఊగిసలాడుతున్నాయి.

ఎదురుగా గోడకి భార్య కల్పన, కూతురు శిరీషల ఫోటో తగిలించబడి ఉన్నాయి. 'మరలా పెళ్ళిచేసుకుంటారా?' అని కల్పన అవహేళన చేస్తున్నట్లుగా ఉంది.

ప్రక్కగదిలోనుండి తల్లి దగ్గు వినబడుతోంది. అసలు ఆమె బలవంతం మీదే తను నిర్ణయించుకున్నాడుగానీ, లేకపోతే ఈ వయసులో తనకు మరలా పెళ్ళేమిటి?

"ఒరేయ్ః రాఘవా! దానికి నూకలు చెల్లి మనందర్నీ విడిచి వెళ్లిపోయింది. పోయినవాళ్ళ గురించి దిగులుపడుతూ మనమూ పోతామా చెప్పు? నేనా... పెద్దదాన్ని అయ్యాను. నా కంఠంలో ప్రాణం కాస్తా గుటుక్కుమంటే, నిన్ను ఇక ఎవరు చూస్తారు చెప్పు? రేపు నీ కొడుక్కి పెళ్ళి చేసి కోడల్ని తెచ్చుకుంటే- వాడు, వాడి కుటుంబం, పిల్లలు, ఉద్యోగం! మరో ఊరు ట్రాన్స్‌ఫరై- వాడు వెళ్లిపోతే నీ అలనాపాలనా చూసేదెవరు చెప్పు? ఈ వయసులో నీకు చేదోడువాదోడుగా ఉండడానికి ఓ ఆడతోడు కావాలి. నేను బ్రతికివుండగా ఆ మూడుముళ్ళు వేసి తెచ్చుకుంటే ఇంట్లో దీపమైనా పెడుతుంది!" తల్లి అన్నమాటలలో ఎంతోకొంత నిజం కనిపించింది.

ఇక్కడ రాఘవేంద్ర గురించి రెండుమాటలు చెప్పాలి. అతను ఇన్సూరెన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య కల్పన, కొడుకు అఖిల్, కూతురు శిరీష!

అఖిల్ సి.ఎ. పాసై బ్యాంక్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శిరీష ఎమ్.సి.ఎ. పూర్తిచేసింది. తల్లి, భార్యాపిల్లలతో ఆనందమయంగా ఉండే ఆ కుటుంబాన్ని విధి అవహేళన చేసింది.

ఆ కాళరాత్రి...

అఖిల్, శిరీషలతో కలసి వాళ్ళమ్మగారింట్లో జరగబోయే ఫంక్షన్‌కి కల్పన కారులో విశాఖపట్నం ప్రయాణమైంది. దురదృష్టవశాత్తూ వారు ప్రయాణం చేస్తున్న కారు అదుపు తప్పి, రోడ్డుప్రక్కగా ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. నుజ్జునుజ్జయిన ఆ కారులో డ్రైవర్‌తోసహా కల్పన, శిరీషలు దుర్మరణం పాలయ్యారు. అఖిల్ ఒక్కడే తీవ్రగాయాలతో బ్రతికి బట్టకట్టగలిగాడు.

మానసికంగా క్రుంగిపోయిన రాఘవేంద్ర- మూడు సంవత్సరాలు ప్రాణమున్న శిలలా బ్రతికాడు.

తన కౌమార్యపు నడిజీవితానికి కల్పన స్థానంలో మరోమనిషి అనివార్యమయింది. తాను యాభయ్యోపడిలో ప్రవేశిస్తున్నా, పాతిక సంవత్సరాల వయసున్న ఉద్యోగం చేసే కొడుకు ఉన్నా, మనసులో గిల్టినెస్ ఫీలవుతూ కుటుంబ పరిస్థితులు రాఘవేంద్రని రెండోపెళ్ళి వైపు ఆలోచింపజేస్తున్నాయి.

పెళ్ళిళ్ల పేరయ్య పురుషోత్తం పట్టుబట్టి రాయలసీమ పోరుమామిళ్ళలోని భద్రమూర్తిగారి సంబంధానికి తీసుకెళ్లాడు. భద్రమూర్తి కుటుంబం కటిక దారిద్ర్యంతో సతమతమవుతోంది. అతనికి భార్య, కూతురు అవని!

"రాఘవేంద్రగారూ! మీవంటి స్థితిపరులకి, మంచివారికి మా అవనిని ఇచ్చి పెళ్ళిచేయడం చాలా ఆనందంగా వుంది. మీ విషయాలు అన్నీ పురుషోత్తంగారు చెప్పారు. మా గురించి కూడా అన్ని విషయాలు మీకు తెలిసి ఉంటాయనుకుంటున్నా! మా అవని చాలా అదృష్టవంతురాలు. ఆర్థికంగా మా స్థితిగతులు అంతంతమాత్రం! కొబ్బరిబోండాంతో పిల్లను ఇవ్వడం తప్ప- ఇంకేమీ ఇచ్చుకోలేని అసమర్థుడ్ని!"

రాఘవేంద్ర మనసు ఒక్కసారి చివుక్కుమంది. ఆ ఇంటిని చూస్తుంటే రాయలసీమలో నెలకొన్న దుర్భర దారిద్ర్యానికి ఉదాహరణగా కనబడుతోంది. ఒంటినిండా కప్పుకోవడానికి పనికిరాని చిరిగిన బట్టలు- అక్కడే ఆరవేసి ఉన్నాయి. కాళ్లు విరిగిన కుర్చీలు, నులక మంచాలు, మట్టిపెళ్లలు ఊడిపడ్డ గోడలు, చెల్లాచెదురుగావున్న తాటాకు ఇల్లు, మట్టి నేల... రాఘవేంద్రను నిరాశపరిచాయి.

పిల్లను తీసుకొచ్చారు.

అవని సౌందర్యరాశి... చక్కని చుక్కలా ఉంది. ప్రకృతి అంతా తానే అన్నట్లు మిరుమిట్లు గొలిపే అందాలను రంగరించుకుని మట్టిలో మాణిక్యంలా కనబడుతోంది. ఉన్నంతలో మంచిబట్టలు కట్టుకుని రాఘవేంద్ర ముందుగా ఒద్దికగా తలవంచుకుని కూర్చుని ఉంది.

ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాడు. పాతిక సంవత్సరాలలోపు వయసున్న ఆమెలో- ఎటువంటి కష్టాన్నయినా అధిగమించగల మనోనిబ్బరం స్పష్టంగా కనబడుతోంది. ఆ కూర్చున్న తీరు- 'యోగ్యుడైన భర్త తనకు దొరకాలేగానీ, మనసు ఊయలలో పెట్టి సేదతీర్చనా!' అన్నట్లుగా ఉంది.

"అమ్మాయ్! అయ్యగారిని చూసి నీ అభిప్రాయం చెప్పు!" పురుషోత్తం అనడంతో- నెమ్మదిగా తలెత్తి చూసింది. ఆ చూపులో తన ప్రమేయం ఏమీలేనట్లు- 'ఒకింత ఆధారం దొరికితే చాలు!' అన్న నిరాశతో కూడిన భావన ద్యోతకమవుతోంది.

పెళ్ళిచూపుల తంతు ముగిసింది.

"ఇంటికి వెళ్లి ఆలోచించుకుని నా అభిప్రాయం తెలియజేస్తాను!"

- అంటూ లేవబోయేంతలో... పోరుమామిళ్ళలో రాయలసీమ ముఠాకక్షలు ప్రజ్వరిల్లి ఒకరినొకరు చంపుకోవడంతో క్షణాల మీద కర్ఫ్యూ విధించడం జరిగిందన్న వార్త తెలిసింది.

విషయాన్ని మోసుకొచ్చిన భద్రమూర్తి "ఈరోజు బంద్ ప్రకటించారు. అయినా, ఇటువంటి ఉద్రిక్త వాతావరణంలో మీరు వెళ్లడం శ్రేయస్కరం కాదు. ఈరోజుకి ఇక్కడే వుండి ఉదయాన్నే వెళితే మంచిదని నా అభిప్రాయం!" అనడంతో ఆరాత్రికి అక్కడ ఉండక తప్పింది కాదు రాఘవేంద్రకు.

కంటిముందు అవని కదలాడుతుంటే గ్రీష్మంలో వసంతం ప్రవేశించినట్టయింది.

"తీసుకోండి!"

- ఇచ్చిన పాలని చూస్తుంటే, పాలకన్నా తెల్లనైన వ్యక్తిత్వం ఆమెలో కనబడుతోంది.

"ఏమైనా కబుర్లు చెప్పకూడదూ?" ఎదురుగా కుర్చీ చూపిస్తూ అడిగాడు-

"నేను నీకు నచ్చానా?"

చిన్నగా నవ్వింది.

"ఆ నవ్వుకు అర్థం?"

"అసలు మీకు నేను నచ్చానా? నేను నచ్చితే, నాకు మీరు నచ్చినట్టే!"

"అదేం మాట?"

"నాకంటూ ఇష్టాలు, నచ్చడాలు ఏమీ లేవు. నాకు నా సుఖం కన్నా ఈ జీవితానికి ఓ తోడు, ప్రేమగా చూసుకుని ఇంత తిండి పెట్టగల ఆధారం ముఖ్యం!"

"నా వయసు యాభై, నీ వయసు పాతిక... అంటే నాలో సగం వయసు నీది! అదీగాక, పిల్లలు పుట్టకుండా నా కిదివరకే ఆపరేషన్ అయింది. నేను నీకు ఏ విధమైన సుఖాన్నీ ఇవ్వలేను. అదీగాక, నన్ను పెళ్ళిచేసుకుంటే మరిన్ని కొత్తసమస్యల్ని కొనితెచ్చుకున్న దానవవుతావు!"

"ఫరవాలేదు!"

"నాకు ఒక ముసలి తల్లి, ఉద్యోగం చేస్తున్న కొడుకు ఉన్నారు. నా తల్లి బాధ్యత నీవు తీసుకోవలసివుంటుంది!"

"తప్పకుండా స్వీకరిస్తాను. ఆదరించే భర్త, అత్తగార్లకు సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తాను!"

"మీ లేమితనం నాతో పెళ్ళికి ఉసిగొల్పుతున్నదని నేను అనుకోవచ్చా?"

"మాది మధ్యతరగతి కుటుంబం. మొదటినుండి మా జీవనాధారం వ్యవసాయం! వర్షాధారిత సేద్యం, రాత్రనకా, పగలనకా వర్షం కోసం ఆశగా ఆకాశంవైపు ఎదురుచూస్తూ ఉంటాము. ఎంత ఎదురుచూసినా, ఎన్ని పూజలు చేసినా, వరుణుడు కరుణించేవాడు కాదు. దానితో బీడులు తీసిన భూములతో పాటు మా బ్రతుకులు కూడా బీటలు తీసేవి. ఎప్పుడో దయదలచి ప్రకృతి తొలకరి జల్లు రూపంలో సేదదీరిస్తే ఆనందంతో ఉప్పొంగిపోతూ వుంటాం. అది మాకు నిజమైన పండుగ. అప్పుడే పొలాలు దుక్కి దున్ని, ఊడ్పులు ఊడుస్తారు. 'పంటలు చేతికి వస్తాయి, కష్టాలు తీరుతాయి, తినడానికి గుప్పెడు గింజలు దొరుకుతాయి...' అని మురిసిపోతూ వుంటాం.

కానీ, ఎక్కడో వందల మైళ్ల దూరంలో ఉన్న సముద్రం ఉప్పొంగి, తుపాను రూపంలోనో, వరద రూపంలోనో మా ప్రాంతాన్ని ముంచెత్తివేస్తూ ఉంటుంది. ఫలితంగా కోతలదాకా వచ్చిన పంట- అక్కరకు రాకుండా తుపాను వరదల్లో కొట్టుకుపోతుంది.

ఆ తర్వాత కథ మామూలే! కట్టుకోవడానికి బట్టల్లేక, తినడానికి తిండిలేక, మమ్మల్ని పోషించడానికి నాన్న ఒక్కో ఎకరం అమ్మివేసేవారు.

క్రూరమైన కరువుకాటకాలతో కాటువేసిన ప్రకృతి- ఈ ప్రాంతవాసుల మదిలో కాఠిన్యాన్ని నెలకొల్పింది. ఫలితంగా ఫ్యాక్షనిజం, ఆధిపత్యం కోసం పోరాటం, ఒకరినొకరు చంపుకోవడం..!

వీటన్నిటికీ మూలం- దారిద్ర్యం, ఆకలి! మాకు సుఖంగా బ్రతకాలి, శాంతిగా జీవించాలని ఉంది. కానీ, అందివచ్చిన అవకాశాలు అవహేళన చేస్తున్నాయి. చదువుకోవాలని ఉన్నా ఆర్థికస్థితి మమ్మల్ని వెక్కిరించింది. ఉన్నవి అమ్ముకుని దుర్భర దారిద్ర్యంతో బ్రతుకుతున్నా- మాలో ఇంకా మమకారం, మంచితనం నిక్షిప్తమై వున్నాయి.

నాకూ ఈడైన వ్యక్తిని పెళ్ళిచేసుకుని, పిల్లల్ని కని, భర్తచాటు భార్యగా బ్రతకాలని ఉంది. కానీ, మాకది అందని ద్రాక్షపండు! దారిద్ర్యంతో ఉన్నవన్నీ అమ్ముకున్న మావాళ్ళు- ఈడొచ్చిన కన్నకూతురి పెళ్ళి చేయలేకపోతున్నారు. వారి గుండెలపై కుంపటిలా కూర్చున్న నేను- వారికి రోజూ ఆవేదనను రగుల్చుతున్నానేగానీ, ఏమాత్రం సంతోషాన్ని ఇవ్వలేకపోతున్నాను.

అమ్మానాన్నల గుండెలపై బరువు తగ్గించాలి. నేనూ, నా దాంపత్య సుఖం, పిల్లల్ని కనడం... అవన్నీ తరువాత! ఎవరో ఒకరు- కనీసం రోజూ తిండిపెట్టగల వ్యక్తి దొరికితే చాలు! దానికి వయసుతో సంబంధం లేదు. మీలాంటి మనసున్న మనిషి దొరికినా చాలునని సంతృప్తి చెందుతున్నాను. ఊపిరాడని సుడిగుండంలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరవుతున్న నాపై మీరు పూలవాన కురిపించి సేదదీర్చారు. మీ సాంగత్యంలో ఈ జీవితం రాగమయంగా సాగిపోవాలని నా ఆశ!"

- అవని చెప్పుకుపోతుంటే అపురూపంగా వింటున్నాడు.

ఆ కమిట్‌మెంట్ తనని మంత్రముగ్ధుడ్ని చేస్తోంది. ఆమె అవకాశం లేక అణగారిన అతివ! అంతటి బాధలోనూ దృఢంగా ఉండే ఆమె 'ఈగో'ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

"అమ్మా అవనీ! మీ పిన్నికి మరల గుండెపోటు వచ్చింది. ఊపిరాడక కొట్టుకుంటోంది. నీకోసం కలవరిస్తోంది... ఒక్కసారి రాగలవా?" పక్కింట్లోని ఆయన పరుగులాంటి నడకతో వచ్చి చెప్పేసరికి- రాఘవేంద్రతో సహా అందరూ అటు పరుగుతీశారు.

నడివయస్కురాలైన ఆవిడ హార్ట్‌అటాక్ వచ్చి బాధతో తల్లడిల్లుతోంది.

అప్పుడే అక్కడికి ఓ యాభైమందికి పైగా పోగయ్యారు. వచ్చిన ఆడవారు, మగవారు కంగారుపడుతూ హడావుడి చేస్తున్నారేగానీ- ఏంచేయాలో ఎవరికీ పాలుపోవడం లేదు.

"గట్టిగా అరవక నోరుమూసుకోండి!" అవని అరుపులాంటి మాటతో ఒక్కసారి ఆ ప్రాంతం నిశ్శబ్దమయింది.

ఎంతో అనుభవమున్నదానిలా, అవని గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రథమచికిత్స చేస్తోంది. పేషెంట్‌ని పడుకోబెట్టి, గుండెను అదిమిపట్టి కొట్టుకునేలా చేయడం, కృత్రిమ శ్వాస అందివ్వడం చేస్తోంది. మిగతావారంతా ప్రేక్షక పాత్ర వహించారేగానీ- ఇంకేమీ చేయలేకపోయారు. మొత్తానికి ఓ అరగంట తరువాత ఆ మనిషి తెప్పరిల్లి నెమ్మదిగా మామూలు స్థితికి రాసాగింది.

"చాలా సహాయం చేశావమ్మా! నీవు లేకపోతే మీ పిన్ని నాకు దక్కేది కాదు!" ఆ ఇంటి యజమాని అంటుంటే- కుతూహలంగా చూడసాగాడు రాఘవేంద్ర. అతనికి ఆ క్షణంలో అవని చాలా విలువైన వ్యక్తిలా అన్పించింది.

"ఏరా రాఘవా! మొన్న చూసిన సంబంధం గురించి ఏమాలోచించావు? అమ్మాయి బాగానే ఉందని అన్నావు. అదీ మొదటి పెళ్ళి సంబంధం! ఇంతకన్నా కావాల్సింది ఏముంది చెప్పు? నువ్వు ఒప్పుకుంటే వెంటనే పంతులుగారిని పిలిచి ముహూర్తాలు పెట్టిస్తాను!" అమ్మ పిలుపుతో వర్తమానంలోకి వచ్చిన రాఘవేంద్ర మనసు మనసులో లేదు.

అసలు మొదట్లో ఆమె అంత చిన్నఅమ్మాయని తెలియదు. అతని ఊహకు భిన్నంగా లేతవయసులో ఉన్న అమ్మాయిని కూర్చోబెట్టారు. పురుషోత్తం మాటవరుసకైనా అమ్మాయి వివరాలు చెప్పలేదు.

'ఆమెకు వయసుకు తగ్గ ఊహలు, ఆలోచనలు ఉంటాయి. కానీ, ఆర్థికస్థితి బాగుండక తనతో పెళ్ళికి ఒప్పుకుంటోంది. తప్పనిసరి పరిస్థితులలో ఈ వివాహం చేసుకోవడానికి అంగీకరిస్తోంది. ఇది న్యాయం కాదు. అవకాశం వచ్చింది కదా అని- తను ఈ సంబంధం ఒప్పుకోవడం నేరం అవుతుంది. చదువు, అందం, సంస్కారం, చక్కటి గుణం అన్నీ ఉండికూడా దారిద్ర్యం వలన ఎంతోమంది ఆడపిల్లలు ఈనాడు ఇటువంటి తప్పనిసరి నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అదే ఆర్థికంగా కొంత వెసులుబాటు ఉంటే ఇలా ఆలోచించవలసిన అవసరం ఉండదు.

ఆ అందచందాలు, నెమ్మదైన తీరు తనని పూర్తిగా ఆకర్షించాయి.

కల్మషం లేని హృదయం, మాటల్లో నిజాయితీ, స్వచ్ఛమైన భావ ప్రకటన, ఎటువంటి సమస్యనైనా అధిగమించగలనన్న మనోనిబ్బరం, ఎదుటివారి మన్నన పొందగల నేర్పు, భర్తను లాలించగలిగే నైజం, ఆమెను ఓ పెద్దింటి కోడల్ని చేయవలసి వుంది. ఆమె ఓ మహాలక్ష్మి! తను పాదం మోపిన ఇల్లు ఓ బృందావనంలా అలరారుతుంది. కేవలం లేమితనం, దారిద్ర్యం వలన ఆమె ఈ విధమైన నిర్ణయం తీసుకోవడం తను జీర్ణించుకోలేకపోతున్నాడు.'

– ఆలోచిస్తున్న రాఘవేంద్ర మనసు గట్టిపడడంతో ఓ నిర్ణయానికి వచ్చాడు. మనసు తేలికపడి తన మనసులో మాటని భద్రమూర్తికి ఉత్తరం ద్వారా తెలియజేశాడు.

"ప్రియమైన భద్రమూర్తిగారికి,

మంచి మర్యాదలతో నా మనసును ఓలలాడించిన మీ ఉన్నత సంస్కారానికి జోహార్లు!

మనిషి మనుగడకు, కోరికలకు, ఫీలింగ్స్‌కు డబ్బు, ఆర్థిక స్థితిగతులు ప్రతిబంధకం కారాదని నా ఉద్దేశ్యం.

మీ అమ్మాయి అవని నాకు పూర్తిగా నచ్చింది. ఆమె సంస్కారం నన్ను పూర్తిగా ఆకర్షించింది. ఆమె ఓ మంచిభర్తకు భార్యగా, పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని నా కోరిక.

నేను విషయం తెలియక పురుషోత్తంగారి పట్టుదల మీద మీ ఇంటికి వచ్చాను. మీ ఇంటి వాతావరణం నాకెంతో నచ్చింది. మీ అమ్మాయిని చూసిన తరువాత నాకు నేను చిన్నతనంగా ఫీలయ్యాను. నేను ఆమెకు తగిన భర్తను ఎంతమాత్రం కాదు. కానీ, అవని మాకు కావాలి.

ఆమె రాకతో మా ఇల్లు బృందావన మవుతుందని ఆశిస్తున్నాను. అందుకే ఆమెను నా కోడలిగా చేసుకుని, పూలవాన కురిపించాలనుకొంటున్నాను. మా అబ్బాయి అఖిల్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. వాడు నా మాట జవదాటడని నా అభిప్రాయం. వెంటనే పెళ్ళికి ముహూర్తాలు పెట్టించగలరు. అమ్మాయిని చూపించేందుకు రేపు ఆదివారం వస్తున్నాము.

చిరంజీవి సౌభాగ్యవతి అవనికి దీవెనలు.

– ఇట్లు
భవదీయుడు
రాఘవేంద్ర."